క్లుప్తంగా

భారీ జాతీయ జెండా ట్రయల్ రన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఎన్‌టీటీ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండా పనులు శరవేగంగా సాగుతున్నాయి. 150 అడుగుల ఎత్తులో జెండా ఎగిరేలా నిర్మించిన భారీ స్తంభాన్ని క్రేన్‌ల సాయంతో ఏర్పాటు చేశారు. సాయంత్రం జెండా ఆవిష్కరణ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పరిశీలించారు. ఆయన వెంట డీఈ తిరుపతి, ఏఈ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.సాయినాథ్ గురువారం ఎస్పీని కలిశారు. ఇక్కడ పనిచేసిన రాజమౌళి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఇక్కడికి వచ్చారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

పోలింగ్ బూత్ పరిశీలన

జైనథ్: జైనథ్ మండల పరిధిలోని ఆకుర్ల, సావాపూర్, బాలాపూర్, పెండల్‌వాడ, లేకర్‌వాడ, సాంగ్వి, కౌట గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను గురువారం తహసీల్దార్ కె.శ్యామ్ సుందర్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ కోసం కనీస వసతులు ఉన్నాయా? లేవా? అనే విషయాలపై ఆరా తీశారు. ఆర్‌ఐ నితిన్, తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయండి

బోథ్: సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ కోరారు. గురువారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.సుభాష్, అంగద్ కేంద్రె, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్, విక్రమ్ సింగ్, జమీర్ ఖాన్, రాథోడ్ ప్రతిమ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సురేందర్ అన్నారు. గురువారం మండలంలోని దేవాపూర్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలు, మోటార్ వాహనాల చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్దుల్లా, పోలీస్ సిబ్బంది ప్రహ్లాద్, హెడ్ కానిస్టేబుల్, రామ్‌రెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కనీస వేతనం అమలు చేయాలని, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సుకన్య, శారద, సరస్వతి పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి

నేరడిగొండ: పంట సాగులో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఏడీఏ శ్రీధర్ స్వామి అన్నారు. గురువారం మండలంలోని కుమారి, గాంధారి గ్రామాల్లో పంట వివరాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయశాఖ అధికారి వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ రాజు, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, ఉప సర్పంచ్ గడ్డం నరేశ్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: కోరుట్లలో ఈనెల 13న పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభకు ప్రతిఒక్కరు తరలిరావాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ కోరారు. బోథ్ మండల కేంద్రంలో గురువారం సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదాశివ్, మెరుగు భోజన్న, జక్కుల వెంకటేశ్, సురేందర్, కార్తీక్, లక్ష్మి నారాయణ, కిష్టు, కిరణ్, గోవర్ధన్, స్వామి, గంగాధర్, సంతోష్, కొక్కుల సంతోష్, తాళ్ల శంకర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ఇచ్చోడ: భారత్ అమృత్ మహోత్సవంలో భాగంగా గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అడేగామ(కె)లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అడేగామ(కె) ప్రాథమిక పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. భారత్ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 30 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సత్యనారయణ, ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం పాల్గొన్నారు.

అండగా ఉంటాం

ఇచ్చోడ: సద్దాం కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. గుడిహత్నూర్ చింతగూడ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సద్దాం కుటుంబసభ్యులను గురువారం నవేగావ్‌లో పరామర్శించారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తుల వెల్లువ

- కిక్కిరిసిన తహసీల్దార్ కార్యాలయాలు
- చివరిరోజు భారీగా తరలివచ్చిన ప్రజలు



సిరికొండ: మీసేవలో దరఖాస్తుదారుల సందడి



ఇంద్రవెల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

ఇంద్రవెల్లి: గృహలక్ష్మి పథకం దరఖాస్తు స్వీకరణ ముగిసింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు సమర్పించారు. గురువారం సాయంత్రం వరకు మొత్తం 3481 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బానోత్ రమేశ్ తెలిపారు. ఈనెల 20 వరకు దరఖాస్తులు పరిశీలించడంతో పాటు అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తాంసి: గృహలక్ష్మి పథకానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. గురువారం పెద్దఎత్తున తరలిరావడంతో తహసీల్దార్ కార్యాలయం కిటకిటలాడింది. తాంసి మండలంలో 1495 మంది దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ లక్ష్మీ తెలిపారు.

భీంపూర్‌లో 2657 దరఖాస్తులు..

మండల కేంద్రంలోని కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 26 పంచాయతీల నుంచి 2657 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.



తాంసి: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు బారులు తీరారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాల వద్ద క్యూకట్టారు. దరఖాస్తుకు గురువారం ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

ఇచ్చోడ: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలు బారులు తీరారు. గురువారం చివరి రోజు అని ప్రచారం కావడంతో గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిల్చొని దరఖాస్తులు సమర్పించారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే జోగు రామన్న
- నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో రూ.34 కోట్లతో నిర్మించనున్న నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే ఇటీవల ప్రభుత్వం నాలుగు 104 వాహనాలు, రెండు 102 వాహనాలు, పార్థివ వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, సర్కారు దవాఖానాల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. టీ హబ్‌లో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రిమ్స్‌లో కోట్లాది రూపాయలతో కొత్త పరికరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, రమేశ్, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్ పాల్గొన్నారు.

పరామర్శ

జైనథ్: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన మండలంలోని పూసాయి గ్రామానికి చెందిన బాధితులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పరామర్శించారు. గ్రామానికి చెందిన సిరిగురి అశోక్ ఇల్లు కాలిపోవడంతో గురువారం ఘటన స్థలానికి చేరుకొని కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. తక్షణ సహాయంగా రూ.10వేలు అందజేశారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం 108 వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉట్నూర్ డివిజన్ ఈఎంఈ కొండల్‌రావు, సలీమొద్దిన్, మర్సుకోల తిరుపతి, కాటంరమేశ్, దావులరమేశ్, అబుజర్, రాజు, శ్రీకాంత్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కోసమే అంగన్‌వాడీ కేంద్రాలు

నార్నూర్: చిన్నారులకు మెరుగైనా సౌకర్యాలు కల్పించేందుకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని ఆర్జుని కొలాంగూడ, రాముగూడ, జంగుగూడ గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో సరదాగడిపారు. సీడీపీవో శారద, ఎంపీపీ అడ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేష్, సర్పంచ్ కాను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అనిల్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి



సిరికొండ: మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సిరికొండ: గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును పెంచాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాట్లాడారు. ఎలాంటి ప్రకటన చేయకుండా తక్కువ సమయంలో దరఖాస్తు గడువును ముగించడం సరికాదన్నారు. గడువు పెంచి, ఇల్లు లేని ప్రతి నిరుపేద లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంరం రఘురాం, పెందుర్ అమృత్ రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి

తాంసి: గృహలక్ష్మి పథకంలో అసలైన అర్హులైన ఎంపిక చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు చిలుక దేవిదాస్ కోరారు. గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూడా దరఖాస్తు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, రాజు, సంతోష్, దత్తు, పాండ్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

తలమడుగు: ప్రభుత్వం ఏఎన్‌ఎంల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి, సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని ఎన్ఎన్ఎంలు వెంకటమ్మ, సువర్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఇటీవల ఏఎన్ఎం ఎగ్జామ్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం పరీక్షలు రాసి ఓపిక మాకు లేదని, ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. ఆగస్టు 15 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రేణుక, లక్ష్మి, మనిలత పాల్గొన్నారు.

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఏ పోస్టుల భర్తీ కోసం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని మండల ఏఎన్ఎం అమ్మిబాయి, శ్యామల డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎదగడం అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన రత్నజాడే ప్రజ్ఞాకుమార్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎదగడం అభినందనీయమని బుద్ధ అంబేడ్కర్ కళావంత్, సీనియర్ బౌద్ధ ఉపాసకులు అన్నారు. ఇటీవల బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో కైలాస్‌నగర్‌లో గల బుద్ధ వీహార్‌లో సన్మానించారు. కార్యక్రమంలో దళిత నేతలు మారుతి, జనార్దన్, సూర్యవంశీ, సంపత్, అనికేత్, బాలాజీ, భగవాన్, గంగన్న, కైలాస్, గంగాధర్ పాల్గొన్నారు.

‘బాధితులను ఆదుకోవడంలో విఫలం’

బేల: వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వాంఖడే వామన్, దేవ్‌తాళే విఠల్, సామ రూపేష్‌రెడ్డి, వాంఖడే రూప్‌రావు, ఎండీ అఖిల్, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.

సర్వీస్ క్రమబద్ధీకరించాలని వినతి

కైలాస్‌నగర్: కృత్రిమ గర్భధారణ సేవలందిస్తూ.. పాడి రైతులకు అండగా నిలుస్తున్న తమను పశుసంవర్ధకశాఖలో శాశ్వత ప్రతిపాదికన విలీనం చేసి, కనీస వేతనం చెల్లించాలని గోపాలమిత్రలు డిమాండ్ చేశారు. గురువారం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కిషన్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. గోపాలమిత్రలు రాంరెడ్డి, నర్సింగ్, అశోక్, గోకుల్, రాజు, మల్లికార్జున్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న రాష్ట్రం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండలంలోని బీర్సాయిపేట, దంతన్‌పల్లి, కొత్తగూడ, ఏందా, గంగాపూర గ్రామాల్లో పర్యటించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించడం జరుగుతుందన్నారు. గంగాపూర్, శ్యాంపూర్ తండా గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, ప్రభాకర్ రెడ్డి, అజీమొద్దిన్, రషీద్, పీఆర్‌డీవో రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రామానికి రాలేదని ధర్నా

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ గురువారం ఉట్నూర్ మండలంలో పర్యటించగా.. తమ గ్రామానికి రాలేదని శ్యాంపూర్ మహిళలు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఆదిలాబాద్- మంచిర్యాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. సర్పంచ్ మల్లిక, ఎస్సై ప్రదీప్‌కుమార్‌లు గ్రామస్తులను సముదాయించడంతో ఆందోళన విరమించారు.

ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో పొందుపర్చాలని డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటోవ తరగతి చదువుతున్న విద్యార్థుల వివరాలు సైతం నమోదు చేయాలని, ఈనెల 14లోగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

సెల్‌ఫోన్లు అందజేత

ఇచ్చోడ: మండల కేంద్రంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు గురువారం సీఐ చంద్రశేఖర్ అందచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి అందచేసినట్లు తెలిపారు.

విధుల్లోకి పంచాయతీ కార్మికులు

బోథ్: పంచాయతీ కార్మికులు విధుల్లో చేరారు. వారి డిమాండ్ల సాధన కోసం చేసిన దీక్షలను ఇటీవల విరమించారు. దీంతో పారిశుధ్య కార్మికులతో పాటు సిబ్బంది విధుల్లో చేరారు. గ్రామాల్లో ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను తొలగించి, రోడ్లను శుభ్రం చేశారు.

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సుహాసినిరెడ్డి, నాయకులు

ఆదిలాబాద్: దేశరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్న సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మేరా దేశ్.. మేరి మిట్టి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సైనిక అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో రక్షణ వ్యవస్థ ఎంతో పటిష్టమైందన్నారు. సైనికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

సప్తాహానికి హాజరు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి హాజరై పూజలు చేశారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న సిటిజన్ యూత్ సభ్యులు

బోథ్: బోథ్ డివిజన్ ఏర్పాటు చేస్తున్న దీక్షలు గురువారం 25వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరంలో సిటిజన్ యూత్ సభ్యులు కూర్చున్నారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ సంఘీభావం ప్రకటించారు. బోథ్‌ను డివిజన్ చేయాలని కోరారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని డివిజన్ సాధన సమితి సభ్యులు హెచ్చరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, కోర్టుకు పక్కా భవనం నిర్మించాలని లేఖ రాసి, లేఖను తిరుపతి వెళుతున్న భక్తులకు అందజేశారు. తిరుమలలోని దేవస్థానంలో లేఖను అందజేయాలని కోరారు.

గాలికుంటు టీకాలు వేయించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అనిల్‌జాదవ్

నేరడిగొండ: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, పశు వైద్యాధికారి సుశీల్ కుమార్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పశు వైద్య సిబ్బంది గాలికుంటు టీకాలు వేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, వడూర్ ఎంపీటీసీ పందరి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(బి)లో గురువారం పశువైద్యాధికారి గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనిత సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవానలి మావల ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్ అన్నారు. గురువారం మావల మండల కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు నోటిలో పుండ్లు రావడం, సొంగ కారడం, కాళ్లకు డెక్కాల మధ్య పుండ్లు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొగ్గలి ప్రమీలా రాజేశ్వర్, వైద్యాధికారి దూద్‌రాం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యూఎస్టీ గ్లోబల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు వచ్చారు. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అదనపు తరగతి గదులు, సుందరీకరణ, మరుగుదొడ్లు, ఇతర అవసరాల కోసం రూ.24 లక్షల వరకు ఖర్చవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలో పూర్తిస్థాయిలో పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విఠల్, విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు సీఆర్టీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, యూఆర్ఎస్‌లలో ఖాళీగా ఉన్న పోస్టుల కోసం ఇటీవల ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించగా.. శుక్రవారం సీఆర్టీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయడం జరుగుతుందని డీఈవో ప్రణిత ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 పద్ధతిన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి డీఈవో కార్యాలయంలో పరిశీలించడం జరుగుతుందన్నారు.

రేపు సంతాప సభ

ఆదిలాబాద్‌రూరల్: ప్రముఖ విద్యావేత్త, మహాత్మ జ్యోతిబా పూలే దంపతులపై అనేక అధ్యయనాలు చేసి వందలాది పుస్తకాలు రాసి పూణే యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, సమతా పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఉన్న ప్రొఫెసర్ హరి నరకే సంతాప సభ శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌజ్‌లో నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుకుమార్ పేట్కులే, సాంబన్న శేండే ఒక ప్రకటనలో తెలిపారు.

వేడివేడి భోజనం అందించాలి

ఇచ్చోడ: వర్షకాలంలో విద్యార్థులకు వేడివేడి భోజనం అందించాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం వంటగదిలోని భోజనాన్ని పరిశీలించారు. ఆకుకూరలు, కూరగాయలు నీటితో కడిగి వండాలన్నారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, తదితరులు ఉన్నారు.

ఆర్మీ జవాన్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ గోడం నగేశ్

నేరడిగొండ: ఆర్మీ జవాన్ సోలంకి సుధాకర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సోలంకి సుధాకర్ సింగ్ రాజస్థాన్ దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న క్రమంలో గుండెపోటుతో మరణించగా.. గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ సోలంకి గీత కరణ్‌సింగ్, నాయకులు గాదె శంకర్, గడ్డం భీంరెడ్డి, మందుల రమేశ్, ఆడెపు రమేశ్ ఉన్నారు.

పరామర్శ

మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎంపీ గోడం నగేశ్, జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌లు పర్యటించారు. గురువారం కుమారి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మాజీ సర్పంచ్ గోండ్ల కిష్టయ్య మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన అలకంటి రాజేశ్వర్ సైతం మృతి చెందగా.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుప్టి గ్రామంలో అంబకంటి కళ గురువారం మృతి చెందడంతో ఆమె పార్థీవ దేహానికి నివాళులర్పించారు.